dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ సపుంటి: 01 సంచిక: 37 ఆదివారం 26 సెప్టెంబర్ 2026

## కరీంనగర్ సిటీ సమాచారం

## ఒద్యారం వెంకన్న గుట్ట చుట్టు భక్తుల గిరిప్రదక్షిణ



**గంగాధర డీసీ :** గంగాధర మండలం ఒద్యారం గ్రామ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం చుట్టు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గిరి ప్రదక్షిణను చేపట్టారు. గుట్టపై గల ఆలయంలో శ్రీ వెంకటేశ్వరస్వామి కొలువుదీరగా, గుట్ట చుట్టు స్వామి వారి ఉత్సవ విగ్రహంతో ఒద్యారం గ్రామస్తులతోపాటు పలు గ్రామాల భక్తులు తొలిసారిగా గిరి ప్రదక్షణ చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కొండగట్టు ఆలయం చుట్టు చేపడ్తుతున్న గిరిప్రదక్షిణను ఆదర్శంగా తీసుకుని ఒద్యారం గ్రామ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం చుట్టు కూడా భక్తులు తొలిసారి గిరిప్రదక్షిణను చేపట్టారు. నేటి నుండి ప్రతి పౌర్ణమి రోజున ఆలయం చుట్ట గిరిప్రదక్షిణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఒద్యారం గ్రామ గుట్టపై 12 వ శతాబ్దంలో ఉత్తర ముఖ ద్వారంగా లక్ష్మీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి స్వయంభుగా వెలిసిన్నట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అయితే తొలిసారిగా ప్రారంభించిన ఈ గిరిప్రదక్షిణకు భక్తుల నుండి అనూహ్య స్పందన లభించిందని 5 వ వార్డు సభ్యుడు బాలసంకుల అనంతరావు వివరించారు. ఈ గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో సర్పంచ్ ఉమ మధు, మాజీ సర్పంచ్ అమ్మాయి, వీవోఏ ఇందిరాకుమారి, సభ్యులు వాసుదేవరావు, వార్డ్ మెంబర్లు నరేందర్, బాపు, అశోక్, అనంతరావు, శిరీష, వజ్రతోపాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.




## గొల్ల కురుమల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**13 రూపాయలకే గొర్రెకు బీమా**

**రుణమాఫీకి చర్యలు**

**తర్వాత తరం అభివృద్ధికి విద్య అవసరం**

**పశు సంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**గొర్రెలు, మేకల బీమా పథకం ప్రారంభం**



**కరీంనగర్ డీసీ**

గొల్ల కురుమల సామాజిక ఆర్థిక రాజకీయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి అభివృద్ధికి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పశు సంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

కరీంనగర్ జిల్లా పద్మ నగర్ లోని ఇందిరా గార్డెన్స్ లో శనివారం ఏర్పాటు చేసిన కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఇదే కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెలు, మేకల బీమాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి పథకం ప్రారంభానికి శ్రీకారం చుట్టారు.

ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గొల్ల కురుమలకు అనేక వాగ్దానాలు చేసి వారిని అభివృద్ధి చేసిన సందర్భం లేదని అన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కులవృత్తిదారులను ప్రోత్సహిస్తుందని, వారిని అన్ని రంగాల్లో ముందుంచేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు.

గొల్ల కురుమలు జీవాలను మేపేందుకు నెలల తరబడి వలస వెళ్తారని, ఈ సమయంలో వారికి అనేక ప్రమాదాలు వచ్చి ఉంటాయని తెలిపారు. గొర్రెలతో పాటు పెంపకం దారులకు తగిన బీమా కల్పించేలా చూస్తామని తెలిపారు. ఏడాదికి కేవలం 13 రూపాయలు చెల్లించి ఒక గొర్రె లేదా మేకకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు. మిగతా సొమ్ము ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. ప్రతి శనివారం హైదరాబాద్కు ఇతర రాష్ట్రాల నుండి వేలకొద్దీ గొర్రెలు మేకలు అమ్మకానికి వస్తాయని తెలిపారు. తెలంగాణలోనూ ఈ దిశగా పెంపకం దారులు ఉత్పత్తిని పెంచాలని సూచించారు.

**రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...**

బడుగు బలహీన వర్గాలకు, కులవృత్తిదారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 750 వరకు గొల్ల కురుమల సహకార సంఘాలు 3200 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం చేసుకోవడం అభినందనీయమని అన్నారు. అనేకమంది సభ్యులు 55 సంవత్సరాలకు పింఛన్ ఇవ్వాల్సిందిగా కోరుతున్నారని తెలిపారు. కులవృత్తిదారులందరికీ 55 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాల్సిందిగా ప్రతిపాదిస్తామని తెలిపారు. ఇందిరమ్మ బీమా పథకంలో భాగంగా కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయల బీమాకు కేబినెట్ ఆమోదం తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. గొర్రెల పెంపకానికి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను సంఘాలకు కేటాయించాల్సిందిగా చర్యలు తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. ఎన్ సి డి సి రుణాన్ని మాఫీ చేయాల్సిందిగా ముఖ్యమంత్రి ముందు ప్రతిపాదన ఉంచుతామని తెలిపారు. అలాగే కరీంనగర్లో హోల్ సేల్ మాంసం విక్రయాల మార్కెట్ ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

భావి తెలంగాణ అభివృద్ధికి విద్య ఎంతో అవసరమని తెలిపారు. ఆర్థికంగా ఎదగడమే కాకుండా పోటీ ప్రపంచంలో నిలబడాలంటే చదువు ఎంతో అవసరమని అన్నారు. కుల వృత్తులను కాపాడుకుంటూనే తమ బిడ్డల చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని గొల్ల కురుమలకు సూచించారు.

తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి కోపరేటివ్ ఫెడరేషన్ చైర్ పర్సన్ కే.సరిత తిరుపతయ్య మాట్లాడుతూ.. కురుమ యాదవులు, పశు సంపద ఎక్కువగా ఉన్న కరీంనగర్ జిల్లాలో బీమా పథకం ప్రారంభించడం సంతోషదాయకమని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిజమైన గొర్రె పెంపకం దారులకు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. గొర్రెల పెంపకం దారుల కష్టనష్టాలు దగ్గరగా చూశాననిఅన్నారు. వారికి వృత్తిపరమైన, రాజకీయ అభివృద్ధికి ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గొల్ల కురుమలు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని సూచించారు.

చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ గొల్ల కురుమలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. వారి రాజకీయ సామాజిక ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తామని తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం లో ఏ అవకాశం వచ్చినా గొల్ల కురుమలకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. గొర్రెలు మేకల బీమా పథకాన్ని ప్రతి పెంపకం దారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో యాదవ, కురుమ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, పశుగణన అభివృద్ధి చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్, పశుసంవర్ధక శాఖ ఎండి సుబ్బారాయుడు, జేడీ లింగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం జిల్లా అధ్యక్షులు బాషవేని మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు చిగుర్ల శ్రీనివాస్ కురుమ, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ ఉద్యోగాలపై సహాయం కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు

**కరీంనగర్:**

తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువతకు సురక్షితమైన, పారదర్శకమైన మరియు చట్టబద్ధమైన విదేశీ ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ ఓవర్‌సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్' (TOMCOM)ను ఏర్పాటు చేసింది. నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు మరియు అంతర్జాతీయ గుర్తింపు పొందిన సంస్థలకు మధ్య ఈ సంస్థ ఒక వారధిలా పనిచేస్తూ నైతిక పద్ధతుల్లో నియామకాలు చేపడుతోంది.

అభ్యర్థులను గ్లోబల్ జాబ్ మార్కెట్‌కు సిద్ధం చేయడానికి టామ్‌కామ్ ప్రత్యేకంగా నైపుణ్యాభివృద్ధి విదేశీ భాషా శిక్షణ మరియు అంతర్జాతీయ ప్రమాణాల సర్టిఫికేషన్లను అందిస్తుంది. వీటితో పాటు పాస్‌పోర్ట్ సహాయం, వీసా ప్రాసెసింగ్ మరియు విదేశాలకు వెళ్లే ముందు ఇచ్చే అవగాహన సదస్సు వంటి కీలక మద్దతు సేవలను కూడా అందజేస్తోంది.

ఈ క్రమంలో, విదేశీ ఉద్యోగాలు మరియు శిక్షణపై ఆసక్తి ఉన్న అభ్యర్థుల వివరాలను సేకరించేందుకు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను అందుబాటులోకి తెచ్చింది. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉన్నా లేదా అవసరమైన సమాచారం కావాలన్నా సంప్రదించడానికి ప్రత్యేకంగా కాల్ సెంటర్ హెల్ప్‌లైన్ నంబర్‌ను కేటాయించారు.

ముఖ్యమైన వివరాలు:

**స్కానర్‌తోనూ హెల్ప్‌లైన్ సలహాలు పొందొచ్చు**

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింక్: https://forms.gle/b1RHKvaggVYBqwHV8

టామ్‌కామ్ కాల్ సెంటర్ (హెల్ప్‌లైన్) నంబర్: 08035524946

అర్హత మరియు ఆసక్తి ఉన్న యువతీయువకులు వెంటనే పైన పేర్కొన్న గూగుల్ ఫారమ్ లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం కాల్ సెంటర్ హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## వెలిచాలలో ఘనంగా చిట్యాల ఐలమ్మ జయంతి



**రామడుగు డీసీ**

చిట్యాల ఐలమ్మ జయంతిని వెలిచాల గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి వెలిచాల సర్పంచ్ వీర్ల నర్సింగారావు హాజరయ్యారు. ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆన మాట్లాడుతూ.. ఐలమ్మ పోరాటం మరువలేనిదని కొనియాడారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.